త్యాగనిరతికి ప్రతీక బక్రీద్


కల్వకుర్తిలో శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గ గ్రామాల్లో ముస్లింలు బక్రీద్‌ను భక్తిశ్రద్ధల మధ్య గురువారం జరుపుకొన్నారు. ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక నమాజు చేశారు. బక్రీద్ ప్రాముఖ్యతను ఇమామ్‌లు తెలియజేశారు. కుర్బానీ స్తోమత ఉన్న ప్రతిఒక్కరూ ఖచ్చితంగా ఇవ్వాలని ఖురాన్ చెబుతుందని తెలియజేశారు. త్యాగాలకు ప్రతీకగా జరుపుకొనే బక్రీద్‌ను ప్రతి ఒక్కరూ సూక్ష్మంగా తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

➪ నాగర్‌కర్నూల్‌లో ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి, మాజీ ఎంపీ మల్లు రవి, తదితరులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతూ పంపిన సందేశాన్ని వివరించారు. ఈద్గా వద్ద అన్ని ఏర్పాట్లు ఘనంగా చేపట్టిన మున్సిపల్ అధికారులకు మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పన, వైస్ చైర్మన్ బాబురావు ఇతర కౌన్సిలర్లకు కృతజ్ఞతలు తెలిపారు. నమాజ్ అనంతరం ఈద్గా వద్ద మున్సిపల్ చైర్ పర్సన్, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు నాగం శశిధర్ రెడ్డి, అర్థం రవి శుభాకాంక్షలు తెలియజేశారు.

➪ ప్రపంచంలో అన్ని మతాల సారం ఒక్కటేనని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తిలోని ఈద్గాల ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

➪ అచ్చంపేటలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ, మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, సీఐ అనుదీప్, ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు ముస్లింలను ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. – 'సాక్షి' నెట్‌వర్క్


శుభాకాంక్షలు తెలుపుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పన


అచ్చంపేటలో ప్రభుత్వ విప్ బాలరాజు


కొల్లాపూర్‌లో ఆర్డీఓ, నాయకులు


కల్వకుర్తిలో ఎమ్మెల్యే జైపాల్ యాదవ్


పాపగల్‌లో..


తెలకపల్లిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


నాగర్‌కర్నూల్‌లో కాంగ్రెస్ నేత నాగం శశిధర్ రెడ్డి


దోమలపెంటలో...


వెల్దండలో...


జూపల్లిలో..


ఊర్కొండలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


యాపట్ల వద్ద ప్రార్థనల అనంతరం మాట్లాడుతున్న ఇమామ్


సిర్సవాడలో వ్రతాల్లో పాల్గొన్న మహిళలు


తెలకపల్లిలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి


కల్వకుర్తి వెంకటేశ్వరస్వామి దేవాలయంలో భక్తుల ప్రత్యేక పూజలు

కల్వకుర్తి రూరల్/ కందనూలు: పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం తొలి ఏకాదశి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయమే ఇళ్లను శుభ్రం చేసుకుని తలంటు స్నానాలు చేసి నిష్టతో దేవుళ్లకు పూజలు చేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వ్రతాలు చేశారు. ఉపవాసాలు ఉన్న భక్తులు నిద్ర పోకుండా రాత్రి వేళల్లో భజనలు చేస్తూ జాగారంతో మొక్కులు తీర్చుకున్నారు. చాలా మంది భక్తులు శ్రీశైలం, ఉమామహేశ్వరం క్షేత్రాలకు తరలివెళ్లారు.

➪ తాడూరు మండల కేంద్రంతో పాటు సిర్సవాడ లక్ష్మీనారసింహాలయంలో పూజారి కపిలవాయి జగదీశ్వరాచారి ఆధ్వర్యంలో వ్రతాలు నిర్వహించారు.

➪ వెల్దండ మండల పరిధిలోని గుండాలలో అంబా రామలింగేశ్వరస్వామి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శివనామస్మరణతో మారుమోగిన సోమశిల

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని సోమశిల గ్రామ సమీపంలోని కృష్ణానది బ్యాక్ వాటర్‌లో తొలి ఏకాదశిని పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు, ప్రజలు పుణ్య స్నానాలు చేశారు. శివనామస్మరణతో సోమశిల పరిసరాలు మారుమోగాయి. కృష్ణమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నది ఒడ్డున ఉన్న సోమేశ్వరాలయంలో సోమేశ్వరుడితో పాటు, ద్వాదశ జ్యోతిర్లింగాలను భక్తులు దర్శించుకున్నారు. నది అవతలి ఒడ్డున ఉన్న సంగమేశ్వరుని ఆలయాన్ని దర్శించుకోవడానికి భక్తుల సౌకర్యార్థం ఇంజిన్ బోట్లను ఏర్పాటు చేశారు. వందలాది మంది భక్తులు సంగమేశ్వరుని దర్శించుకున్నారు.

లొద్దిలో మార్మోగిన శివనామస్మరణ

బల్మూర్: మండలంలోని బాణాల అటవీ ప్రాంతంలో వెలిసిన లొద్ది మల్లయ్య క్షేత్రానికి తొలి ఏకాదశిని పురస్కరించుకుని జిల్లా నలుమూలల నుంచి శ్రీశైలం- మన్ననూర్ మార్గం ద్వారా భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు.

ఊర్కొండ: తొలిఏకాదశి సందర్భంగా ఊర్కొండపేటలోని శ్రీదత్తాత్రేయ శర్మ, శ్రీనివాస శర్మ ఇంటి నుంచి పబ్బపతి ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తిని ఊర్కొండపేట పురవీధుల ఊరేగించారు. స్వామి వారి సన్నిధిలో అర్చన అభిషేకం చేశారు.


ఊర్కొండలో ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తిని తీసుకెళ్తున్న భక్తులు


సోమశిల వద్ద కృష్ణానదిలో స్నానాలు చేస్తున్న భక్తులు


నదిలో సంగమేశ్వరుని దర్శించుకోవడానికి బోటులో వెళ్తున్న భక్తులు


కృష్ణమ్మకు పూజలు చేస్తున్న భక్తులు


మన్ననూర్‌లోని లింగమయ్య స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


మంచాలకట్టలో కృష్ణానది ఒడ్డున పూజలు నిర్వహిస్తున్న భక్తులు


ఉప్పునుంతల కేదారేశ్వరాలయంలో శివుడికి పూజలు చేస్తున్న మహిళలు


గుండాలలో అభిషేకం చేస్తున్న భక్తులు

క్లుప్తంగా

సీఐగా బాధ్యతల స్వీకరణ

నాగర్‌కర్నూల్ క్రైం: శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రజలు పోలీసుశాఖకు సహకరించాలని సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ నుంచి పదోన్నతి పొంది బదిలీపై వచ్చిన సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు.

కొనసాగిన దీక్షలు

కొల్లాపూర్: కళాకారులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ.. తెలంగాణ దండోరా, జానపద కళాకారుల సంఘం నాయకులు చేపట్టిన రిలేదీక్షలు రెండో రోజు కొనసాగాయి. దీక్షలకు గురువారం దళిత నాయకులు తిరుపాలు, కుడికిళ్ల రాము సంఘీభావం ప్రకటించారు. గోపి, నర్సింహ, రామకృష్ణ తదితరులున్నారు.

అర్హులకే రిజర్వేషన్లు అమలు చేయాలి

కందనూలు: హిందూ కులాల దళితులకే రిజర్వేషన్లు అమలు చేయాలని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పుల నర్సింహ కోరారు. ఎస్సీ రిజర్వేషన్ల దుర్వినియోగంపై గురువారం నాగర్‌కర్నూల్ మార్కెట్‌లోని శివాలయం సమావేశ హాల్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు సామాజిక సమరసత రాష్ట్ర అధ్యక్షుడు డా. వంశ తిలక్, రాష్ట్ర అధ్యక్షుడు మారేడు మోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మతం మారిన దళితులు, ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వాలా వద్దా? అనే విషయంపై కేంద్రం కేజీ బాలకిషన్ కమిషన్ ఏర్పాటు చేసిందని, ఈ కమిషన్ ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గకుండా పాత రిజర్వేషన్ల విధానాన్ని కొనసాగించేలా కేంద్రానికి నివేదిక ఇవ్వాలని అందరూ అభిప్రాయపడ్డారు. ఇతర మతాల్లో చేరి కులాధారమైన రిజర్వేషన్లు కావాలని అడగడం చట్ట విరుద్ధమని.. ఇది భారత రాజ్యాంగ స్ఫూర్తికి, అంబేడ్కర్ ఆలోచన విధానానికి వ్యతిరేకమని వక్తలు అభిప్రాయపడ్డారు. హిందూ సమాజం కూడా మతమార్పిడులకు అడ్డుకట్ట వేయాలని కోరారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు డా. దేవేంద్రప్ప, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు జీనుకుంట్ల భాస్కర్, జిల్లా కార్యదర్శి కాకి వినోద్, నాగిళ్ల రమేష్, చందు, ప్రసాద్, కిషోర్, కుమార్, యాదగిరి పాల్గొన్నారు.

ఆలయ భూములు కబ్జా చేస్తే చర్యలు


గుండాల దేవాలయ ఆవరణలో భూ ఆక్రమణపై సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

వెల్దండ: మండల పరిధిలోని గుండాలలోని అంబా రామలింగేశ్వరస్వామి దేవాలయ భూమి కబ్జాకు గురికావడంతో గురువారం సర్వేయర్ ఆధ్వర్యంలో భూ సర్వే చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సర్వే నంబర్ 25లో 0.25 గుంటల భూమి కబ్జాకు గురైనట్లు ఫిర్యాదు చేశామన్నారు. పూర్తి చేసి హద్దులను ఏర్పాటు చేస్తామని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. దేవాలయ భూమి కబ్జా చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సర్పంచ్ మైసయ్య, దేవాలయ ఈఓ ప్రసాద్, అర్చకులు బాలస్వామిశర్మ, కృష్ణయ్య శర్మ, నరహరిశర్మ, సురేష్‌శర్మ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల సీట్ల భర్తీ

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని జేపీనగర్ గురుకుల పాఠశాలలో మిగిలిన ఇంటర్ సీట్లు భర్తీ చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ దానం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలోని ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో ప్రథమ సంవత్సరంలో మిగిలిన సీట్లకు 2023 విద్యాసంవత్సరంలో జిల్లాలోని పదో తరగతి పాసైన విద్యార్థులు అర్హులని, విద్యార్హత ఒరిజినల్ పత్రాలు తీసుకుని వచ్చి, కళాశాలలో వచ్చే నెల వరకు సంప్రదించాలని కోరారు.

ఘనంగా ఏకలవ్యుడి జయంతి

లింగాల: మండల కేంద్రంలో గురువారం ఏకలవ్యుడి జయంతిని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఎరుకల సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కోనేటి తిర్పతయ్య, నాగేశ్వర్, వెంకటయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణ

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో సర్వే నంబర్ 22, 27లోని 14 ఎకరాల ప్రభుత్వ భూమిని, తీర ప్రాంగనాన్ని పెంట్లవెల్లి గ్రామ ప్రజలు ఎస్సీ, బీసీలు గురువారం ఉదయం ఆ భూమిలోని కొంత స్థలాన్ని ఆక్రమించుకుని స్థలం చుట్టూ చీరలు కట్టుకున్నారు. గతంలో ఈ స్థలం పేదలకు ఇళ్ల స్థలాల కోసం కొనుగోలు చేసినా.. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ స్థలాన్ని పంచలేదు. ఇప్పటికైనా పేదలకు స్థలాలు పంచి వెంటనే ఇళ్లు కట్టించాలని డిమాండ్ చేస్తూ.. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాలను పలువురు ఆక్రమించుకున్నారు. ఎన్నో ఏళ్లుగా అద్దె ఇళ్లలోనే చాలీచాలని వేతనంతో గడుపుతున్నామని, వెంటనే మాకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఈశ్వర్, హన్మంతు, మండల ప్రజలు పాల్గొన్నారు.



సుంకిరెడ్డికి షోకాజ్ నోటీసులు జారీ

కల్వకుర్తి రూరల్: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ పార్టీకి నష్టం చేస్తున్నారని చెబుతూ ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డికి గురువారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి షోకాజ్ నోటీసు జారీ చేశారు. మార్చి 14, 2022లోనే కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం తీసుకున్న రాఘవేందర్‌రెడ్డి రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర, ప్రియాంకా గాంధీ యువ సంఘర్షణ యాత్రతో పాటు ఎలాంటి గ్రామ, మండల నియోజకవర్గ, రాష్ట్ర స్థాయి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనలేదన్నారు. ఇతర పార్టీల నాయకులతో రాజకీయ వ్యవహారాలు కొనసాగిస్తూ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడ్డారని షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు.

'జగదీశ్వర్‌రావుకే కాంగ్రెస్ టికెట్ ప్రకటించాలి'

కొల్లాపూర్: కొల్లాపూర్ అసెంబ్లీ టికెట్ చింతలపల్లి జగదీశ్వర్‌రావుకే ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు పరశురాం నాయుడుతో పాటు పలువురు నాయకులు గురువారం సమావేశమయ్యారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. గతంలో మంత్రి పదవులు అనుభవించిన జూపల్లి కృష్ణారావు పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు తన ప్రయోజనాల కోసం కాంగ్రెస్‌ని వదిలిపెట్టి వెళ్లిపోయారన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి కూడా ఇదే తరహాలో కాంగ్రెస్ పార్టీని వీడారన్నారు. నియోజకవర్గంలో పార్టీకి పెద్దదిక్కు లేని సమయంలో జగదీశ్వర్‌రావు కాంగ్రెస్ పార్టీలో చేరి పార్టీని బలోపేతం చేశారన్నారు. ఆయన నేతృత్వంలో కొల్లాపూర్‌లో నిర్వహించిన 'మన ఊరు–మన పోరు' సభకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు లభించిందన్నారు. పట్టణ అధ్యక్షుడు కాంతారావు, రాంచందర్ నాయుడు, వెంకటస్వామి, చిన్నరావు, నాగన్న, మధు తదితరులున్నారు.

పుస్తక రచయితకు సత్కారం

కల్వకుర్తిరూరల్: పోటీ పరీక్షలు రాసే అభ్యర్థుల కోసం మండలంలోని వేపూరుకి చెందిన సురేష్‌గౌడ్ 'భారత రాజ్యాంగం' అనే పుస్తకాన్ని రచించి విడుదల చేశారు. గురువారం సురేందర్ ఇంటికి వెళ్లి తెలంగాణ నాన్‌గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ శాలువాతో సత్కరించారు. రాఘవేందర్‌రావు, వెంకట్రాములు పాల్గొన్నారు.

విధులు బాధ్యతగా నిర్వర్తించాలి

అమ్రాబాద్: వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఠాణాలోని పలు రికార్డులను పరిశీలించి సీఐ ఆదిరెడ్డి, ఎస్ వీరబాబుకు పలు సూచనలు చేశారు. అంతకుముందు స్టేషన్‌కు వచ్చిన ఎస్పీకి సీఐ, ఎస్ఐ మొక్కలు అందజేసి స్వాగతం పలికారు.

మలిదశ ఉద్యమకారుడికి ఘన నివాళి


కొల్లాపూర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..


కల్వకుర్తిలో నివాళి అర్పిస్తున్న బాలాజీ సింగ్


నాగర్‌కర్నూల్‌లో నివాళి అర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పన


తెలకపల్లిలో నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు తదితరులు

నాగర్‌కర్నూల్ రూరల్ / వెల్దండ/ లింగాల/ పెంట్లవెల్లి: మండల పరిధిలోని జటప్రోల్ సర్పంచ్ ఎసకె ఖాజా ఆధ్వర్యంలో నివాళి అర్పించారు.

చారకొండ: సాయిచందు మృతి తెలంగాణ సమాజానికి తీరని లోటని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, సింగిల్ విండో చైర్మన్ గుర్వయ్య గౌడ్ అన్నారు.

కందనూలు: మలిదశ ఉద్యమకారుడు, రాష్ట్ర గిడ్డంగుల శాఖ చైర్మన్ సాయి చంద్ ఆకస్మిక మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పన అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద సాయి చందు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

కొల్లాపూర్: పట్టణంలో రాజకీయ నాయకులు, కళాకారులు, దళిత సంఘాల నాయకులు సంతాపాలు ప్రకటించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద సాయిచంద్ చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద దళిత సంఘాల నాయకులు, అంబేడ్కర్ చౌరస్తాలో తెలంగాణ దండోరా, జానపద కళాకారులు సాయిచంద్‌కు నివాళి అర్పించారు.

మన్ననూర్: ప్రజా గాయకుడు మాద్దుల నర్సింహ, మన్ననూర్‌లో తోటి కళాకారులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

తెలకపల్లి: మండల కేంద్రం నెహ్రూ చౌరస్తాలో సాయిచందు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

కల్వకుర్తిరూరల్: సాయిచందు మృతి తీరని లోటని జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్ ఆవేదన వ్యక్తం చేశారు.

అచ్చంపేట రూరల్: సాయిచంద్ ఆకస్మిక మరణం బీఆర్ఎస్‌కు తీరనిలోటని మద్దిమడుగు ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ విష్ణుమూర్తి అన్నారు. అచ్చంపేటలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు.

అంతయ్య ఆశయాలను కొనసాగిస్తాం..

నాగర్‌కర్నూల్ రూరల్: పోరాటాలపై నిర్బంధం విధించే శక్తులపై తిరుగుబాటు చేసి నేలకొరిగిన అంతయ్య ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు అన్నారు. గురువారం అంతయ్య 30వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అశోక్, కాశన్న, రామయ్య, నర్సింహ, శంకర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

భక్తులను అడ్డుకోవడం తగదు

బల్మూర్: తొలి ఏకాదశి సందర్భంగా అటవీ ప్రాంతంలోని లొద్ది మల్లయ్య పుణ్యక్షేత్రాన్ని దర్శించుకొనేందుకు వెళ్లే భక్తులను బాణాల మార్గంలో పోలీసులు, అటవీ సిబ్బంది అడ్డుకోవడం సరైంది కాదని డీసీసీ అధ్యక్షుడు డా. వంశీకృష్ణ అన్నారు. ఇది భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఉందని మండిపడ్డారు. ఈ విషయమై గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. బాణాల అటవీ మార్గంలో భక్తులు కాలినడకన, వాహనాల్లో వెళ్లి దర్శించుకోవడం అనవాయితీగా వస్తుందని.. దారిలో గుంతలు తీసి వెళ్లనివ్వకుండా ఆంక్షలు విధించడం విడ్డూరంగా ఉందన్నారు. ఎనిమిది రోజులు జరిగే సలేశ్వరం ఉత్సవాలను మూడురోజులకు కుదించి భక్తుల చావుకు కారణమయ్యారని.. లొద్ది క్షేత్రంలో మూడు రోజులు జరిగే ఏకాదశి పండుగను ఒక రోజుకే కుదించడం విచారకరమన్నారు.